దేవునిగుట్టకు మెట్ల మార్గం

- అటవీ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం
- పూర్తయితే పర్యాటక ప్రాంతంగా గుర్తింపు

ములుగురూరల్, సెప్టెంబర్15 : ప్రపంచ ప్రఖ్యాత 'అంకోర్ బాట్'తో పోలిక ఉన్న ములుగు మండలం కొత్తూరులోని గుట్టపై ఉన్న పురాతన ఆలయానికి అటవీ శాఖ ఆధ్వర్యంలో మెట్ల మార్గం నిర్మిస్తున్నారు. పిరమిడ్ ఆకారంలో ఉండే ఈ ఆలయం ఒక్కో లేత ఎరుపు రంగు ఇసుక రాయిపై ఒక్కో ఇటుకపై శిల్పాల ఆకారాన్ని చెక్కి ఒక్కటిగా చేర్చి ఉంది. ఈ ఆలయం 1500 ఏళ్ల క్రితం నిర్మించారు. అభయారణ్యంలో ఉన్న ఆలయానికి మెట్ల దారి నిర్మాణం పూర్తయితే దేవునిగుట్టకు పర్యాటక ప్రాంతంగా గుర్తింపు లభించనున్నది. ఆలయ కమిటీ సభ్యుల అభ్యర్థన మేరకు కలెక్టర్‌తో పాటు మంత్రి సీతక్క దేవునిగుట్టపైకి భక్తులు, పర్యాటకులు సులభంగా వెళ్లేందుకు మెట్ల మార్గం నిర్మించాలని అటవీ శాఖ అధికారులను ఆదేశించారు. దీంతో సుమారు కిలో మీటరు మేర మెట్లను గుట్టపైకి భక్తులు చేరుకునేందుకు అటవీ శాఖ అధికారులు నిర్మిస్తున్నారు. ఐదు రోజుల నుంచి పనులు చేపట్టిన కాంట్రాక్టర్ మెట్ల మార్గాన్ని చదును చేసి బండరాళ్లతో నింపారు. ఇప్పటికే 100 మీటర్ల మేరా మార్గం పూర్తయింది. కిలో మీటరన్నర రోడ్డు మార్గాన్ని పూర్తి చేసిన తర్వాత దానిపై సీసీ వేయడంతో పాటు కూలిపోకుండా రెవిటింగ్ చేయనున్నారు. అదేవిధంగా వృద్ధులు, దివ్యాంగులు, చిన్నారులు సులభంగా గుట్టపైకి వెళ్లేందుకు మార్గం రెండు వైపులా పోల్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఫారెస్టు రేంజర్ సారథ్యంలో జరుగుతున్న ఈ పనులు 2025 మార్చి లోపు పూర్తి చేయనున్నారు. పూర్తి స్థాయిలో దేవునిగుట్టపైకి మెట్ల మార్గం అందుబాటులోకి వస్తే భక్తులతో పాటు పర్యాటక సంఖ్య పెరిగి దేవునిగుట్ట ఆలయానికి మరింత గుర్తింపు లభించే అవకాశం ఉంది.



గుట్టపైకి వేస్తున్న మెట్ల మార్గం

అటవీ శాఖలో 'బొంగుల' డ్రామా!

- వెదురు బొంగులు తరలిస్తున్న డీసీఎం పట్టుకున్నది ఒక చోట
- నాలుగు రోజుల అనంతరం మరో చోట పట్టుకున్నట్లు చిత్రీకరణ
- బొంగు వెళ్లేది అటవీ శాఖ ప్లాంటేషన్‌కైతే కేసు ఎందుకు..?
- ఇద్దరు అధికారుల సస్పెన్షన్‌పై అనుమానాలు

గోవిందరావుపేట, సెప్టెంబర్ 15 : పచ్చని అడవికి ప్రాణ వలయంగా ఉండాల్సిన ఫారెస్టు శాఖలో కంచే చేను మేస్తుందా? అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ములుగు జిల్లా గోవిందరావుపేట మండల పస్రా అటవీ శాఖ రేంజ్‌లోని అధికారుల తీరుపై పలు అనుమానాలు రేకెత్తిస్తుంది. అడవిలో గుట్టు చప్పుడు కాకుండా కొట్టుకొని పోతున్న వెదురు బెంగు డీసీఎం లోడ్‌ను ప్లాన్ వేసి మరీ పట్టుకున్న అధికారులు విషయాన్ని బయటకు పొక్కకుండా నాలుగు రోజుల పాటు దాచి మళ్లీ తనిఖీల పేరుతో చెక్‌పోస్టుల వద్ద పట్టుకున్నట్లు చిత్రీకరించడంతో పాటు ఇందులో ఇద్దరు అధికారులను సస్పెండ్ చేయడం జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశమైంది. అటవీ ప్రాంతంలో నుంచి డీసీఎం లోడులో వెళ్తున్న వెదురు బొంగు కర్ర అటవీ శాఖలోని ప్లాంటేషన్‌కే వెళ్తుంది. ఇలా వెళ్లే డీసీఎంను ఎందుకు పట్టుకోవాల్సి వచ్చిందో.., అసలు డీసీఎంలో ఏం రవాణా జరిగిందో..? వెదురు బొంగులని చెబుతున్న అధికారులు దాని వెనుక ఉన్న మర్మాన్ని దాచడంపై పలు అనుమానాలకు తావిస్తున్నది. కాగా, కర్లపల్లి సమీపంలోని పస్రా రేంజ్ పరిధిలోని టెడిటోరియల్, వైల్డ్ లైఫ్ రేంజ్‌ల ఆధ్వర్యంలోని ప్లాంటేషన్ల నుంచి డీసీఎం ద్వారా కంకబొంగు తరలిస్తే సదరు రేంజ్ అధికారులను సస్పెండ్ చేయకుండా ఒక రేంజ్ పరిధిలోని ఇద్దరు కింది స్థాయి అధికారులను మాత్రమే సస్పెండ్ చేయడం ఏమిటని అధికార వర్గాల్లో చర్చమొదలైంది.

కర్లపల్లి నుంచి భూపాలపల్లికి కంక బొంగు

మండలంలోని పస్రా రేంజ్ పరిధిలోని గుండ్లవాగు ప్రాజెక్టు సమీపంలో ఉన్న టెరిటోరియల్, వైల్డ్ లైఫ్‌ల పరిధిలోని ప్లాంటేషన్ నుంచి గత నెల 25న అక్రమంగా కంకబొంగు తరలిస్తుండగా పక్కా సమాచారం మేరకు మేడారం రేంజ్ అధికారి బయ్యక్కపేట సమీపంలో డీసీఎం లోడును పట్టుకున్నట్లు సమాచారం. పట్టుకున్న డీసీఎంను మూడు, నాలుగు రోజుల పాటు నార్లాపూర్‌లోనే ఉంచి అటవీ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు అపరాధ రుసుం కింద డబ్బు తీసుకొని డీసీఎంను వదిలి వేసినట్లు తెలిసింది. అయితే, ఆ లోడ్ భూపాలపల్లి జిల్లాకు చేరుకుంది. ఈ విషయం బయటకు రావడంతో ఏం చేయాలో తోచక సంబంధిత అధికారులు నాలుగు రోజుల తర్వాత ఆగమేఘాలపై అదే లోడ్‌ను తిరిగి పస్రా చెక్‌పోస్టు వద్దకు తెప్పించి, తనిఖీలో ఆ రోజే పట్టుబడినట్లు చూపించి కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

అధికారుల కనుసన్నల్లోనే..

అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్న ప్లాంటేషన్‌లకు అటవీ శాఖ అధికారులు కంక బొంగును తీసుకెళ్తున్నట్లు సమాచారం. ఏటా అంకన్నగూడెం, రాయినిగూడెం, సర్వాపురం, మేడారం, బయ్యక్కపేట, మేడారం సమీపంలోని గుడ్డేలుగుల గుట్ట, కర్లపల్లి అటవీ పరిధి నుంచి స్వయాన అటవీ శాఖ అధికారులు కంకబొంగులను కొట్టించి ప్లాంటేషన్‌కు తీసుకెళ్లినట్లు ఆ శాఖలోని కొందరు అధికారులు చెబుతున్నారు. అధికారుల అండతోనే సాగుతున్న వెదురు బొంగుల రవాణాను ఇటీవల ఎందుకు పట్టుకున్నారో... భూపాలపల్లి పరిధికి వెళ్లే డీసీఎంను ఆపడానికి గల కారణాలు ఏమిటనేది తెలడం లేదు. గత నెల 25న మధ్యాహ్నం పస్రా చెక్‌పోస్టు నుంచి డీసీఎం వెళ్తుంటే అధికారులు ఆపకుండా పంపి బయ్యక్కపేటలో పట్టుకోవడం చర్చనీయాంశంగా మారింది. కాగా, వెదురు బొంగు నరికిన ప్రాంతమంతా టెరిటోయిల్, వైల్డ్‌లైఫ్ పరిధిలో ఉన్నప్పటికీ కేవలం టెరిటోరియల్‌కు సంబంధించిన కర్లపల్లి బీట్ డిప్యూటీ రేంజ్ అధికారి శోభన్‌తో పాటు ఒడ్డుగూడెం బీట్ ఆఫీసర్ ఎర్రయ్యను ఈ నెల 5న సస్పెండ్ చేసినట్లు తెలిసింది. అయితే, వైల్డ్ లైఫ్ అధికారులపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఉన్నతాధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నట్లు పలువురు ఉద్యోగులు ఆరోపిస్తున్నారు. ఈ విషయమై మేడారం రేంజ్ అధికారిని వివరణ కోరేందుకు ఫోన్‌లో సంప్రదించగా అందుబాటులోకి రాలేదు.

బాధితురాలికి న్యాయం చేసిన ఎస్సై

కన్నాయిగూడెం, సెప్టెంబర్ 15 : పోలీస్‌స్టేషన్‌కు వెళితే న్యాయం జరుగుతుందని ఎస్సై వెంకటేశ్ మరోసారి నిరూపించారు. మండలంలో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన బాధితురాలు ఆసరెల్లి చిలుకమ్మకు న్యాయం జరిగింది. ఆదివారం బాధితురాలి కథనం ప్రకారం.. పలిమెల మండలం పంకెన గ్రామానికి చెందిన చిలుకమ్మ నాలుగేళ్ల క్రితం తన భూమి విషయంలో పంచాయితీ కోసం కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన సంతోష్ అనే వ్యక్తికి రూ.30 వేలు ఇచ్చింది. కొన్ని రోజుల తర్వాత ఆమె మోసపోయానని గుర్తించి, తన దగ్గర నుంచి అన్యాయంగా తీసుకున్న డబ్బులు తిరిగి ఇవ్వాలని సంతోష్‌ను కోరింది. దీంతో అతడు మూడు నెలల్లో ఇస్తానని ఒప్పందపత్రం రాయించి ఇచ్చాడు. అయినా ఎంతకూ నగదును తిరిగి ఇవ్వకపోవడంతో పలిమెల, కన్నాయిగూడెం పోలీస్‌స్టేషన్లకు బాధితులు పలుమార్లు తిరిగి ఫిర్యాదు చేసినా ఎవరూ పట్టించుకోలేదు. ఇప్పుడు కొత్తగా వచ్చిన ఎస్సై వెంకటేశ్ తనకు జరిగిన అన్యాయాన్ని చెప్పిన వెంటనే స్పందించి, సంతోష్ నుంచి రూ.20 వేలను ఇప్పించి న్యాయం చేశారని చిలుకమ్మ సంతోషం వ్యక్తం చేసింది.

బాధితురాలికి న్యాయం చేయాలని ధర్నా

- గంటకు పైగా నిలిచిన రాకపోకలు
- గ్రామస్తులతో చర్చించిన డీఎస్పీ రవీందర్
- ఆందోళన విరమించిన గ్రామస్తులు

ధర్నా చేస్తున్న బాధితురాలి బంధువులు, పెరుకపల్లి గ్రామస్తులు

వెంకటాపూర్, సెప్టెంబర్ 15 : రేప్ బాధితురాలికి న్యాయం చేయాలని పోలీస్ స్టేషన్ ఎదుట బాధితురాలి బంధువులు, గ్రామస్తులు ఆదివారం ధర్నా నిర్వహించారు. భూపాలపల్లి మండలంలోని పెరుకపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలిపై అదే గ్రామానికి చెందిన మాదం శివకుమార్ లైంగికదాడి చేసి మూడు రోజులు దాటినప్పటికీ పోలీసులు చర్యలు తీసుకోకపోవడంతో న్యాయం చేయాలంటూ గ్రామస్తులంతా ధర్నా చేశారు. ఈ నెల 11న లైంగికదాడికి పాల్పడగా కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేసినప్పటికీ పోలీసు అధికారులు చర్యలు తీసుకోలేదు. ములుగు జిల్లా ఎస్పీ శబరీష్‌ను కలిసేందుకు వెళ్తున్న 200 మంది గ్రామస్తులను పోలీసులు తాళ్లపాడు వద్ద అడ్డగించారు. దీంతో ఆగ్రహం చెందిన గ్రామస్తులు వెంకటాపూర్ పోలీస్‌స్టేషన్ ఎదుట ధర్నాకు దిగారు. నిందితుడు గ్రామంలో తిరుగుతూ ఎవరైనా సాక్ష్యం చెబితే చంపుతానని భయభ్రాంతులకు గురి చేస్తుంటే పోలీసులు ఎందుకు పట్టించుకుంట లేరని ఆరోపిస్తూ ఆందోళన చేశారు. ఎస్సై జక్కుల సతీశ్ గ్రామస్తులతో మాట్లడినప్పటికీ వినకపోవడంతో సంఘటన స్థలానికి ములుగు డీఎస్పీ రవీందర్, సీఐ శంకర్ చేరుకున్నారు. గ్రామస్తులతో వారు మాట్లడగా న్యాయం చేయకపోతే కదిలేది లేదని చెప్పడంతో బాధితురాలు, కుటుంబ సభ్యులు, పెద్ద మనుషులను పోలీస్ స్టేషన్‌లోకి పిలిపించి, న్యాయం చేస్తానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. సుమారు గంటకు పైగా ధర్నా చేయడంతో రెండు వైపులా వాహనాలు నిలిచి రాకపోకలు స్తంభించాయి. ఈ సందర్భంగా భాదితురాలి కుటుంబ సభ్యులు విలేకరులతో మాట్లడుతూ ఈ నెల 11న లైంగికదాడి జరిగితే పోలీసు అధికారులు ఇప్పటి వరకూ న్యాయం చేయలేదని, న్యాయం కోసం ఎస్పీ దగ్గరకు వెళుతుంటే ఎస్సై, పోలీసులు అడ్డగించి పోలీస్ స్టేషన్‌కు తరలించడం ఏంటని ప్రశ్నించారు. న్యాయం కోసం ఎస్పీని కలవడం కూడా తప్పేనా? అని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సీఐని వివరణ కోరగా ఈ నెల 12న కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేస్తే కేసు నమోదు చేశామని, కుటుంబ సభ్యులు రోజుకో విధంగా ఆరోపణలు చేస్తూ ఫిర్యాదు చేస్తున్నారని అన్నారు. నిందితుడిని 48 గంటల్లో అరెస్ట్ చేస్తామని తెలిపారు. కాగా, గతంలో నిందితుడిపై ఐదు కేసులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

అమరులను అవమానిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు



ర్యాలీ నిర్వహిస్తున్న సీపీఐ నాయకులు

కృష్ణకాలనీ, సెప్టెంబర్ 15 : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా ప్రకటించడం అర్థరహితమని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళపల్లి శ్రీనివాసరావు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్న తెలంగాణ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా పార్టీ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలోని కొమురయ్య భవన్ నుంచి ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో తెలంగాణ అమరవీరుల స్తూపం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అమరవీరులకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై జెండాను ఆవిష్కరించారు. అనంతరం జిల్లా కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ సెప్టెంబర్ 17ను తెలంగాణ విలీన దినోత్సవంగా అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కపట నాటకాలు ఆడుతున్నాయని విమర్శించారు. నైజాం వ్యతిరేక పోరాటంలో బీజేపీ పాత్ర ఏమాత్రం లేదన్నారు. పైగా తెలంగాణ పోరాటాన్ని హిందూ, ముస్లిం మధ్య జరిగిన గొడవగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. తెలంగాణ సాయుధ పోరాటవారసులు కమ్యూనిస్టులేనని స్పష్టం చేశారు. తెలంగాణ విలీన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహిస్తామని, ట్యాంక్ బండ్‌పై సాయుధ పోరాట యోధుల విగ్రహాలు పెడుతామని, పాఠ్యపుస్తకాల్లో పోరాట చరిత్రను చేర్చుతామని చెప్పిన కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు ఆ హామీలను నెరవేర్చలేదని ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వం సెప్టెంబర్ 17ను ప్రజాపాలన దినోత్సవంగా జరుపుతామనడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మోటపలుకుల రమేశ్, కొరిమి సుగుణ, పట్టణ కార్యదర్శి మామిడాల సమ్మిరెడ్డి, పైళ్ల శాంతి కుమార్, సోతుకు ప్రవీణ్ కుమార్, క్యాతరాజు సతీశ్, కౌన్సిలర్ నూకల భూలక్ష్మీ చంద్రమౌళి, నేరెళ్ల జోసెఫ్, ఏఐటీయూసీ నాయకులు మాతంగి రామచందర్, విజేందర్, శంకర్, జీ శ్రీనివాస్ పోశం, గోలి లావణ్య, వనిత, స్వరూప, సంధ్య, పద్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న శంకర్

లైంగికదాడి నిందితుడిని కఠినంగా శిక్షించాలి

ములుగురూరల్, సెప్టెంబర్15 : పెరికపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని ములుగు జిల్లా రజక సంఘం జిల్లా అధ్యక్షుడు నేరెళ్ల శంకర్ డిమాండ్ చేశారు. ఆదివారం ములుగులో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ లైంగిక దాడిని ఖండిస్తున్నట్లు తెలిపారు. సదరు యువకుడిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నగరపు రమేశ్, బండి మధు, గుమ్మడి లక్ష్మణ్, ఓదేలు, స్వామి, సదానందం, కుమార్, రాజు, వెంకన్న, కాశిరాజు, రమేశ్, శ్రీకాంత్, నరేశ్, భిక్షపతి, ప్రవీణ్, సృజన్, కుమారస్వామి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

బంగారమే శ్రీరామరక్ష!

ఆపత్కాలంలో ఆదుకునేది బంగారం మాత్రమే. సమయానికి చేతిలో చిల్లిగవ్వ లేనప్పుడు ఈ పుత్తడే మీకు పరమాన్నంగా మారుతున్నది. ఆరోగ్యం బాగోలేక ఆసుపత్రి పాలైనప్పుడు ఈ గోల్డే మీకు ఆర్థికంగా ఆదుకుంటుంది. ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు బంగారమే శ్రీరామరక్ష. సామాన్యుడి నుంచి మొదలుకొని సంపన్నవర్గాలు కూడా ప్రతియేటా బంగారం ఎంతోకొంత కొనుగోలు చేస్తున్నారు. అక్కరకు వచ్చినప్పుడు ఈ గోల్డ్‌ను తాకట్టుపెట్టుకొని రుణాలు తీసుకుంటున్నారు. వీటికోసం బ్యాంకులతోపాటు ఆర్థిక సేవల సంస్థలు ప్రత్యేకంగా పసిడిపై రుణాలు మంజూరు చేస్తున్నాయి. సెక్యూర్డ్ రుణాలు కావడంతో బంగారం విలువలో 80 శాతం వరకు రుణాలు మంజూరు చేస్తున్నాయి బ్యాంకులు, ఆర్థిక సేవల సంస్థలు. బంగారం కడ్డీలతోపాటు ఆభరణాలు తాకట్టుపెట్టుకొని కేవలం కొన్ని నిమిషాల్లోనే రుణం పొందవచ్చును. వ్యక్తిగత రుణాలు, ఇతర రుణాలు తీసుకోవాలంటే రోజుల సమయం పడుతుంది కానీ, బంగారంపై రుణాలు తీసుకోవడం ఎంతో సులభం. పెద్దగా డాక్యుమెంట్లు లేకుండానే తీసుకోవచ్చును. తక్కువ వడ్డీకే రుణాలు తీసుకోవచ్చును. ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. ప్రభుత్వరంగ బ్యాంకులతో పాటు ప్రైవేట్ రంగ బ్యాంకులు 8 శాతం మొదలు కొని 24 శాతం వరకు వడ్డీని ఆఫర్ చేస్తున్నాయి. తీసుకున్న రుణాలను ఏడాదిలోగా చెల్లించాల్సి ఉంటుంది. లేకపోతే బ్యాంకులు తాకట్టుకింద పెట్టిన ఆభరణాలను జప్తు చేసుకొని వేలం వేసుకునే అధికారం ఉంటుంది. పసిడి విలువను గుర్తించడంలో ఒక్కో బ్యాంకుది ఒక్కో తీరుగా ఉంటుంది.

పసిడి రుణాలపై ఏయే బ్యాంకుల్లో ఎంత వడ్డీ

బ్యాంక్	వడ్డీరేటు(శాతంలో)	ప్రాసెసింగ్ ఫీజు
కొటక్ మహీంద్రా	8 నుంచి 24 వరకు	2 శాతం+జీఎస్టీ
హెచ్‌డీఎఫ్‌సీ	8.30 నుంచి 16.55 వరకు	ఒక్క శాతం
సెంట్రల్ బ్యాంక్	8.40 నుంచి 9.25 వరకు	రుణంపై అరశాతం
యూకో	8.50	రూ.250-5 వేల వరకు
ఇండియన్ బ్యాంక్	8.80 నుంచి 9 వరకు	రుణంపై 0.56 శాతం
యూనియన్ బ్యాంక్	8.65 నుంచి 9.90 వరకు	-
ఎస్బీఐ	8.70	అర శాతం+జీఎస్టీ
ఇండస్‌ఇండ్	8.75 నుంచి 16 వరకు	రుణంపై ఒక్క శాతం
బంధన్ బ్యాంక్	8.75 నుంచి 19.25 వరకు	ఒక్క శాతం+జీఎస్టీ
బ్యాంక్ ఆఫ్ బరోడా	9.15	వర్తించే చార్జీలు+జీఎస్టీ
పంజాబ్ నేషనల్	9.25	రుణంపై 0.75 శాతం
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	9.30	రూ.500-2,000+జీఎస్టీ
ఫెడరల్ బ్యాంక్	9.49	-
కెనరా బ్యాంక్	9.60	రూ.500-5 వేల వరకు
ఐసీఐసీఐ బ్యాంక్	10	రుణంపై ఒక్క శాతం

క్రెడిట్ స్కోర్ అక్కర్లేదు..

సిబిల్ స్కోర్ లేకుండానే బంగారంపై రుణాలు తీసుకోవచ్చును. కేవలం బంగారం లేదా ఆభరణాలు తాకట్టు పెట్టుకొని రుణాలు తీసుకోవచ్చును. దీనికోసం వారి క్రెడిట్ స్కోర్ ఎంత ఉన్నదో అవసరం లేదు. 500 లోపు సిబిలి స్కోర్ ఉన్నవారు కూడా సులువుగా రుణాలు తీసుకోవచ్చును.

కావాల్సిన డాక్యుమెంట్లు

బంగారం తాకట్టుపై రుణాలు తీసుకోవడానికి పలు డాక్యుమెంట్లు అవసరం ఉంటాయి. వీటిలో ఆధార్ కార్డుతోపాటు పాన్ కార్డు, బ్యాంక్ ఖాతాతోపాటు కేవైసీ డాక్యుమెంట్ సమర్పించాల్సి ఉంటుంది. మనం తీసుకునే బ్యాంకులోనే ఖాతా ఉండాల్సి ఉంటుంది. ఇటీవలకాలంలో బ్యాంకులతోపాటు పసిడిపై రుణాలు ఎన్‌బీఎఫ్‌సీలు కూడా ఇస్తున్నాయి.

తిరిగి చెల్లింపులు ఎలా..

బంగారంపై తాకట్టుపై రుణాలు తీసుకున్నవారు మూడు రకాలుగా తిరిగి చెల్లింపులు జరుపుకునే అవకాశాలను బ్యాంకులు కల్పించాయి. వీటిలో నెలవారి చెల్లింపుల రూపంలో చెల్లింపులు జరుపుకోవచ్చును, లేదా మూడు నెలల్లో వడ్డీతో సహా తీసుకున్న రుణాన్ని చెల్లించవచ్చును. అలాగే ఆరు నెలలు, ఏడాది కాల పరిమితితో తీసుకున్న రుణాలను వడ్డీతో కలుపుకొని చెల్లించుకోవచ్చును. ఒకవేళ ఏడాది ముగిసిన తర్వాత తీసుకున్న రుణానికి వడ్డీని చెల్లించి మళ్లీ రెన్యూవల్ చేసుకోవచ్చు.

రాబడి

ఫెడ్ నిర్ణయమే కీలకం..

దేశీయ స్టాక్ మార్కెట్లు లాభాల జోష్‌లో సాగుతున్నాయి. మదుపరులు పెట్టుబడులకు మద్దతు పలుకుతున్నారు. గత వారం ట్రేడింగ్‌లో గురువారం ఒక్కరోజే సెన్సెక్స్ 1,440, నిఫ్టీ 470 పాయింట్లు పెరిగాయి. ఈ క్రమంలోనే వారం మొత్తంగా సూచీలు భారీ ఎత్తున పుంజుకోగలిగాయి. అంతకుముందు వారం ముగింపుతో చూస్తే బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 1,707.01 పాయింట్లు ఎగిసి 82,890.94 వద్ద నిలిచింది. అలాగే నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ సైతం 504.35 పాయింట్లు ఎగబాకి 25,356.50 దగ్గర ముగిసింది. మునుపెన్నడూ లేనివిధంగా సెన్సెక్స్ తొలిసారి 83వేల మార్కును అధిగమించింది. నిఫ్టీ సైతం నూతన గరిష్ఠాలను తాకింది. ఈ నేపథ్యంలో ఈ వారం అమ్మకాల ఒత్తిడికి ఆస్కారం కనిపిస్తున్నది. శుక్రవారమే మార్కెట్లలో సెల్లింగ్ ప్రెషర్ ఉండటాన్ని గమనించవచ్చు. పారిశ్రామికోత్పత్తి మందగించడం, ద్రవ్యోల్బణం మళ్లీ విజృంభిస్తున్న సంకేతాలు రావడంతో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు బ్రేక్ వేయవచ్చన్న అభిప్రాయాలను మెజారిటీ నిపుణులు వ్యక్తం చేస్తున్నారు. పైగా సూచీలు ఆల్‌టైమ్ హైల్లో ఉండటం కూడా లాభాల స్వీకరణకు తావిస్తోందంటున్నారు. ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్ ద్రవ్య సమీక్ష ప్రభావం కూడా కనిపించనున్నది. ఇక గ్లోబల్ స్టాక్ మార్కెట్లు, విదేశీ సంస్థాగత మదుపరుల పెట్టుబడులు, అంతర్జాతీయ పరిణామాలు, డాలర్‌తో పోల్చితే రూపాయి మారకం విలువ ఈ వారం కూడా భారతీయ స్టాక్ మార్కెట్ల తీరును నిర్దేశించనున్నాయి. అమ్మకాల ఒత్తిడి ఎదురైతే నిఫ్టీకి 24,900 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 24,700 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం 25,700–25,900 మధ్యకు నిఫ్టీ వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

చివరగా..

స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఏ బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

కొత్త పీపీఎఫ్ రూల్స్

అక్టోబర్ 1 నుంచి అమల్లోకి..

పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ (పీపీఎఫ్) ఖాతాలను మైనర్ల కోసం కూడా తెరుచుకోవచ్చు. మారిన నిబంధనల ప్రకారం సదరు మైనర్లకు 18 ఏండ్లు నిండేదాకా ఈ ఖాతాలు పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ వడ్డీ రేటుతో కొనసాగుతాయి. మైనార్టీ తీరిన తర్వాత పీపీఎఫ్ ఖాతాగా మార్చుకోవచ్చు. ఈ మేరకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ఇక ఒకటికి మించి పీపీఎఫ్ ఖాతాలనూ తెరుచుకోవచ్చు. అలాగే ప్రవాస భారతీయులు (ఎన్నారైలు) పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ స్కీం (పీపీఎఫ్) 1968 కింద క్రియాశీల పీపీఎఫ్ ఖాతాలను తెరిస్తే ఫామ్ హెచ్ ద్వారా ఖాతాదారుని నివాస హోదా గురించి అడగకపోతే పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్ మార్గదర్శకాల ప్రకారం ఈ నెలాఖరుదాకా ఉండే వడ్డీరేట్లు వర్తిస్తాయి. పీపీఎఫ్ అనేది కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సాధనం. అంతేగాక మదుపరులను దీర్ఘకాలిక ఆకర్షణీయ ప్రయోజనాలతో కూడిన సేవింగ్స్, పెట్టుబడులకు ప్రోత్సహించే పథకం ఇది. దీనికి ఆదాయ పన్ను (ఐటీ) మినహాయింపులూ వర్తిస్తాయి.

షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా

లాభాలు, పరిమితులు తెలుసా?



షార్ట్-టర్మ్ ఆరోగ్య బీమా తాత్కాలిక కవరేజీని కల్పిస్తుంది. దీన్నే టర్మ్ మెడికల్ ఇన్సూరెన్స్ అని కూడా పిలుస్తారు. సాధారణంగా ఇది కొద్ది నెలల నుంచి ఏడాదిదాకే ఉంటుంది. ఎవరైతే స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలతో వచ్చే దీర్ఘకాలిక ఆరోగ్య బీమాలు కాకుండా తక్షణ కవరేజీలను కోరుకుంటారో వారినుద్దేశించినదే ఈ పాలసీ. సమగ్ర కవరేజీని కొనలేనివారికి కూడా ఇది ఉపయుక్తంగా ఉంటుంది. కంపెనీల్లో గ్రూప్ ఇన్సూరెన్స్ కోసం వేచిచూస్తున్న ఉద్యోగులు, నిరుద్యోగులకు దీని అవసరం ఎక్కువని చెప్పవచ్చు.

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ శైలి

- కేవలం కొద్ది నెలల నుంచి ఏడాది వరకే బీమా కవరేజీ.
- లాంగ్-టర్మ్ ప్లాన్లతో పోల్చితే షార్ట్-టర్మ్ ప్లాన్లకు ప్రీమియంలు తక్కువే.
- ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు బీమా కవరేజీ ఉండకపోవచ్చు. కొన్ని రకాల చికిత్సలకూ వీలుండదు.
- కనీస ఆరోగ్య సమాచారంతో ఈ ప్లాన్లను తీసుకోవచ్చు.
- పరిమిత స్థాయిలోనే ఈ ప్లాన్ల చెల్లుబాటు ఉంటుంది. ఎంపిక చేసిన నెట్‌వర్క్‌లో తప్ప.. అన్ని దవాఖానల్లో చెల్లవు.
- లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలను రెన్యువల్ చేసుకున్నట్టుగా ఈ షార్ట్-టర్మ్ పాలసీలను రెన్యువల్ చేసుకోలేం.

చివరగా..

షార్ట్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లు తక్షణ అవసరాలకే పనికొస్తాయి. కాబట్టి లాంగ్-టర్మ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడే దీర్ఘకాలిక ఆరోగ్య ప్రయోజనాలను పొందుతాం. ప్రీమియంలు ఎక్కువైనప్పటికీ క్లెయిములు లేకపోతే కవరేజీలు పెరిగే ప్రయోజనం ఉంటుంది. మెటర్నిటీ, మెంటల్ హెల్త్ తదితర అవసరాలు, సమస్యలకూ స్టాండర్డ్ హెల్త్ ఇన్సూరెన్స్‌లే లాభదాయకం అని స్పష్టంగా చెప్పవచ్చు. అందుకే సమగ్ర ప్యాకేజీని తీసుకోవడం మరువద్దు.

యూబీఐ ప్రత్యేక డిపాజిట్ స్కీం

ప్రభుత్వ రంగ సంస్థ యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా డిపాజిట్లను ఆకట్టుకోవడానికి ప్రత్యేక డిపాజిట్ స్కీంను మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. 333 రోజుల కాలపరిమితితో యూనియన్ సమృద్ధి స్కీంపై అధిక వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. ఈ స్కీంలో కనీసంగా రూ.1,000 నుంచి రూ.3 కోట్ల లోపు డిపాజిట్ చేయవచ్చును. ఈ స్కీంపై సాధారణ ప్రజలకు 7.40 శాతం వార్షిక వడ్డీని చెల్లిస్తున్న బ్యాంక్..సీనియర్ సిటిజన్లకు 7.90 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 8.15 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది బ్యాంక్. మెచ్యూర్ కాకముందే ఈ డిపాజిట్లను విత్‌డ్రా చేసుకునే అవకాశాన్ని బ్యాంక్ కల్పించింది. కానీ, ఇలా చేసుకుంటే ఒక్క శాతం వడ్డీని తగ్గి చెల్లించనున్నది. ఈ డిపాజిట్ స్కీంను ఎంచుకోవడానికి బ్యాంక్ శాఖ లేదా వెబ్‌సైట్ ద్వారా డిపాజిట్ చేయవచ్చును.